క్లుప్తంగా

నీట్ విద్యార్థినికి చేయూత



విద్యార్థినికి ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్టు సభ్యులు

ఆమనగల్లు: కల్వకుర్తి పట్టణానికి చెందిన విద్యార్థిని నందిని నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్ సాయం అందించారు. మంగళవారం విద్యార్థినికి రూ.20 వేలను ట్రస్టు సభ్యుడు డా.ఉప్పల అఖిల్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు



రసాయనిక సామగ్రిని పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కమిషనర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. పారిశుద్ధ కార్మికులతో కలిసి దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు, వాడుతున్న కెమికల్స్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడటం, వ్యాధులు వ్యాపించకుండా నిరోధించడం బాధ్యతతో కూడిన పనులన్నారు. వర్షాలు కురుస్తున్నందున మురుగు కాలువలు, కుంటల్లో నీరు నిలిచిన ప్రదేశాల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయనతోపాటు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సాయిరెడ్డి సిబ్బంది ఉన్నారు.

దంచి కొట్టిన వర్షం



ఇబ్రహీంపట్నంలో కురుస్తున్న వర్షం

ఇబ్రహీంపట్నం: భారీ వర్షం ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది. మంగళవారం సాయంత్రం నుంచి ఇబ్రహీంపట్నంలో ఏకధాటిగా వాన కురిసింది. ఇటీవల వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్న సమయంలో రెండు రోజులుగా చిరు జల్లులు మాత్రమే కురిశాయి. కానీ మంగళవారం రాత్రి ఏడు గంటల నుంచి వర్షం దంచి కొట్టింది. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనాదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



ఎస్‌బీఐలో ఆవిర్భావ వేడుకలు

యాచారం: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఎస్‌బీఐ యాచారం బ్రాంచి మేనేజర్ మాన్యనాయక్ పేర్కొన్నారు. బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రైతుల నుంచి వ్యాపారుల వరకు ఆర్థిక అండగా ఉంటూ సేవలు అందిస్తుందన్నారు. ఖాతాదారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే అత్యవసరమున్న వారికి తిరిగి రుణాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య సభ్యులకు సన్మానం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సభ్యులకు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. మండల సమాఖ్య, గ్రామ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, కార్యదర్శి సులోచన, కోశాధికారి అలివేలు, మాజీ అధ్యక్షురాలు అనురాధ, మాజీ కోశాధికారి చంద్రమణి, ఏపీఎం నగేశ్ పాల్గొన్నారు.

ప్రతి అర్జీ ఆన్‌లైన్!

- రెవెన్యూ సదస్సులపై అధికారుల ఫోకస్
- అభ్యంతరాలపై నోటీసుల జారీకి చర్యలు
- యథావిధిగా ఎకరాకు రూ.2,500 మ్యూటేషన్ ఫీజు
- ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 8,147 దరఖాస్తులు



ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం

యాచారం: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర సర్కార్ భూ భారతి పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా జూన్ 3 నుంచి 18వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రతి దరఖాస్తుకు అధికారులు రశీదులు కూడా జారీ చేశారు. ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్‌లోని హయత్‌నగర్, మంచాల, యాచారం, మాడ్గుల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 8,147 దరఖాస్తులు వచ్చాయి. సమస్య స్వరూపం, ఎన్నాళ్ల నుంచి ఉంది.. తదితర విషయాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆయా మండలాల్లో నమోదు ప్రక్రియ కూడా పూర్తి కావొచ్చింది.

మంచాల అత్యధికం

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. ఎక్కువ మంది అర్జీ చేసిన వాటికి సరైన వివరాలు తెలిపే పత్రాలు జత చేయలేదు. అలాంటి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. డివిజన్‌లో అత్యధికంగా మంచాల మండలం నుంచి 2,459, యాచారం 2,079, అబ్దుల్లాపూర్‌మెట్ 1,711, ఇబ్రహీంపట్నం 1,291 దరఖాస్తులు వచ్చాయి. హయత్‌నగర్ 3, మాడ్గుల 604 అర్జీలు అందాయి. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అధికారులు అభ్యంతరాలు, పరిష్కారానికి గాను అవసరమైన రైతులకు నోటీసులు జారీ చేసి వివరాలు తెప్పించుకుని పరిష్కరించనున్నారు. స్పెషల్ డ్రైవ్ కింద సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆయా మండలాల తహసీల్దార్లు, ఆర్డీఓను ఆదేశించారు.

మ్యూటేషన్ ఫీజు చెల్లించాల్సిందే

సదస్సుల్లో మ్యూటేషన్, విరాసత్, సాదాబైనామా, మిస్సింగ్ సర్వేనంబరు, భూమి ఎకరాల్లో తేడా, రైతుల పేర్లల్లో తప్పులు, ఇంటిపేరు తప్పులు ఇలా పలు సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. డివిజన్‌లో దాదాపు 2వేలకు పైగా దరఖాస్తులు మ్యూటేషన్, విరాసత్‌ల కోసమే వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఇన్నాళ్లు రైతులు ఏ సమస్యపైనైన మీ సేవల్లో అర్జీ చేసుకుంటే రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సిన నిబంధన ఉంది. ప్రస్తుతం రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు పెట్టుకున్న రైతులకు ఫీజు మాఫీ కాగా, అదే మ్యూటేషన్, విరాసత్‌ల కోసమైతే ఎకరాకు రూ.2,500ల చొప్పున వసూల్ చేయాలని సర్కార్ నిర్ణయించింది.

భారం వేయొద్దు



రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలపై చేసుకున్న దరఖాస్తులను ఉచితంగానే పరిష్కరించాలి. మళ్లీ మ్యూటేషన్, విరాసత్‌ల కోసం ఫీజులు చెల్లించాలంటే పేద రైతులకు ఇబ్బందిగా ఉంటుంది. సర్కార్ ఆలోచన చేయాలి. ఈ విషయమై ఎమ్మెల్యే రంగారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిల దృష్టికి తీసుకెళ్తాను.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, నందివనపర్తి

సత్వరమే పరిష్కరిస్తాం



భూ భారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ పూర్తి కావచ్చింది. స్పెషల్‌డ్రైవ్ కింద అన్ని అర్జీలు పరిష్కరించేలా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. అవసరమైన రైతులకు మాత్రమే నోటీసులు జారీ చేస్తాం. మ్యూటేషన్, విరాసత్‌ల ఫీజుల చెల్లింపులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



రైతు వేదికలో అవగాహన కల్పిస్తున్న ఏఓ రవినాథ్

యాచారం: భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రిజిస్ట్రీపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి రవినాథ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ సిబ్బంది, రైతులతో ఆయన సమావేశమయ్యారు. రైతులంతా ఈ నెల 8 లోపు ఐడీ కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ కలిగిన ఫోన్‌నంబరు, పట్టాదారు పాసుపుస్తకాలతో కూడిన వివరాలు అందజేయాలని చెప్పారు. యాచారం క్లస్టర్‌లో యాచారం, మొగుళ్లవంపు, నందివనపర్తి, నస్దిక్‌సింగారం, అయ్యవారిగూడెం, తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లితండాలు ఏఈఓ సంతోష్‌కుమార్ ఫోన్ నంబరు 6305920174, నక్కర్తమేడిపల్లి క్లస్టర్‌లో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కొత్తపల్లి, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలు ఏఈఓ రమేశ్ ఫోన్ నంబరు 6305920175, గునుగల్ క్లస్టర్‌లో గడ్డమల్లయ్యగూడ, గునుగల్, చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి, చింతుల్ల, ధర్మన్నగూడెం గ్రామాలు ఏఈఓ రాధమ్మ ఫోను నంబరు 6305920176, మాల్ క్లస్టర్‌లో మాల్, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, మంతంగౌడ్, చింతపట్ల, తమ్మలోనిగూడ గ్రామాలు ఏఈఓ వసంత ఫోనునంబరు 6305920177లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

ఈత, ఖర్జూర చెట్లను నాటండి

ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్



గట్టుప్పలపల్లిలో చెట్లను అందజేస్తున్న పోలీసులు

ఆమనగల్లు: ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా రైతులు ఈత, ఖర్జూర చెట్లను నాటేందుకు ముందుకు రావాలని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ కోరారు. మంగళవారం తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి గ్రామంలో వన మహోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన జగత్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఈత, ఖర్జూర చెట్లను సీఐ ఆధ్వర్యంలో నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికులు ఈత, ఖర్జూర చెట్లను నాటేందుకు ముందుకువస్తే మొక్కలను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. మొక్కలు కావాల్సిన వారు ఆమనగల్లు ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు అరుణ్‌కుమార్, సిబ్బంది శంకర్, దశరథ్, ఉపేందర్, లోక్య, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు అభివృద్ధికి కృషి



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలో రూ.25 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆమనగల్లును ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో రూ.26 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు ఓపెన్ జిమ్‌లను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లులో అభివృద్ధి అంతగా జరగలేదన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నామని చెప్పారు. మరో రూ.15 కోట్లతో పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. నిధుల విడుదలకు అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి మంజూరు చేపిస్తామని స్పష్టం చేశారు. త్వరలో మున్సిపాలిటీలో ప్రత్యేక సమావేశం నిర్వహించి అభివృద్ధిపై చర్చిస్తామని తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

పట్టణంలో రాజీవ్ చౌరస్తా నుంచి సందబావి వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత, రాష్ట్ర చెంచు యువజన సంఘం అధ్యక్షుడు రాములు, డైరెక్టర్లు శ్రీశైలం, పాండురంగయ్య, రవీందర్, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, పీసీబీ మాజీ సభ్యుడు బాలాజీసింగ్, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఏఈ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు సత్యనారాయణ, దామోదర్, అఫ్రోజ్, ఉపేందర్‌రెడ్డి, ఎల్లయ్య, ఎస్ఐ వెంకటేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు నర్సింహ, శ్రీకాంత్, మానయ్య, విజయ్, ఖాదర్‌ఖాద్రి, మెకానిక్‌బాబా, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, కృష్ణనాయక్, అలీం, నాజర్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



చికిత్సకు బయలుదేరుతున్న రోగులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ సాయి ఆప్టికల్స్ ఆవరణలో సికింద్రాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య సహాయకులు కొౖట్ర మల్లేశ్, శ్రావణి ఆధ్వర్యంలో 162 మందికి పరీక్షలు చేశారు. ఇందులో 68 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసి పుష్పగిరి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో పంపించారు. కార్యక్రమంలో సిబ్బంది గీత, షబానా తదితరులు పాల్గొన్నారు. శ్రీ సాయి ఆప్టికల్స్‌లో ప్రతినెలా మొదటివారంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మల్లేశ్ తెలిపారు.

ఎంఐఎస్ కోఆర్డినేటర్‌కి నివాళి

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల ఎంఐఎస్ కో ఆర్డినేటర్ రాజేశ్ మృతిపట్ల ఆమనగల్లు మండల ఎంఆర్‌సీ ఉద్యోగులు తీవ్ర సంతాపం ప్రకటించారు. ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద రాజేశ్ చిత్రపటాన్ని ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఐఎస్ కో ఆర్డినేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ ఉద్యోగులు శైలజ, షేక్ అహ్మద్, కిషన్, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎత్‌బార్‌పల్లి గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: మాకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి.. ఇళ్లు కట్టుకోవడానికి స్థలం లేదు.. గ్రామంలో ఇళ్ల స్థలాల కోసం గతంలో కేటాయించిన భూమిలో ఇళ్లు కట్టుకుంటాం. మాకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ పట్టాలు ఇవ్వండి సారూ అంటూ ఎత్‌బార్‌పల్లి గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. మండల పరిధిలోని ఎత్‌బార్‌పల్లి గ్రామస్తులు బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 14/2లో 3.37 ఎకరాల భూమిని గతంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఇళ్ల స్థలాలకు కేటాయించిందని.. అప్పట్లో 25 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు సర్వే నంబర్ 14/2లో ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

పనిచేసిన వారికే పదవులు

బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి



మాట్లాడుతున్న అనంత్‌రెడ్డి

చేవెళ్ల: బీజేపీలో కిందిస్థాయి నుంచి పార్టీని నమ్ముకొని పనిచేసే వారికే పదవులు వస్తాయని చెప్పటానికి నిదర్శనమే రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక అని మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు ఎన్నికపై హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో గత 40 ఏళ్లుగా ఉంటూ ఎన్నో విధాలుగా పార్టీకి సేవలందించిన వ్యక్తి రామచంద్రరావు అన్నారు. అలాంటి వ్యక్తిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక చేయటం పార్టీకి మరింత బలాన్ని ఇస్తుందన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కలిసి పనిచేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచంద్రరావుకు మున్సిపాలిటీ తరపున శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ దేవుని శర్వలింగం, నాయకులు అంజనేయులుగౌడ్, శివశంకర్, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఇంకెన్నాళ్లీ అవస్థలు!



కందుకూరు చౌరస్తాలోని రైస్‌మిల్ ఎదుట రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

- హైదరాబాద్–శ్రీశైలం రహదారిపై నిలిచిన మురుగు, వర్షం నీరు
- కల్వర్టు తొలగించడంతో సమస్య తీవ్రం
- పట్టించుకోని నేషనల్ హైవే అధికారులు

కందుకూరు: హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిని విస్తరించి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు మురుగు, వర్షం నీరు పోయే మార్గాన్ని అన్వేషించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో నిత్యం రహదారిపై మురుగుతో పాటు వర్షం కురిసినప్పుడు నీరు నిలిచి ప్రయాణికులకు, స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. అయినా సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకొన్నారే తప్పా, సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపలేకపోయారు. ఇదీ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఉన్న ప్రస్తుత దుస్థితి.

ప్రణాళిక లేకుండా నిర్మాణం

హైదరాబాద్–శ్రీశైలం రహదారిని 2016 సంవత్సరంలో విస్తరించారు. ఆ సమయంలో కందుకూరు చౌరస్తా నుంచి కొత్తగూడ చౌరస్తా మధ్యలో ప్రణాళిక లేకుండా నిర్మాణం చేపట్టింది అప్పటి కాంట్రాక్ట్ సంస్థ. పాత కల్వర్టులను పూర్తిగా తొలగించి రోడ్డు నిర్మించింది. దీంతో పాటు కందుకూరు చౌరస్తా నుంచి కొత్తగూడ చౌరస్తా మధ్యలో రెండు వైపులా పల్లంగా నిర్మించడంతో పాటు అక్కడ రైస్ మిల్ వద్ద ఉన్న కల్వర్టును తొలగించింది. దీంతో అప్పటి నుంచి మురుగుతో పాటు వర్షం నీరు నిలిచి సమస్యగా మారింది. దాదాపు రెండేళ్ల క్రితం స్థానికుల ఆందోళనలతో రోడ్డు కింద నుంచే కల్వర్టు నిర్మించి చేతులు దులుపుకున్నారు. అక్కడి నుంచి నీరు బయటికి పోయే మార్గం లేక ప్రస్తుతం ఆ కల్వర్టు పూర్తిగా నిండిపోయి రోడ్డుపైనే మురుగు, వర్షం నీరు నిలుస్తుంది. దీంతో రాకపోకలు సాగించే వారితో పాటు ఆ సమీపంలోని వ్యాపారస్తులకు మురుగు నీటితో ఇబ్బందికరంగా మారింది. దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు అధికమై అవస్థలు పడుతున్నారు. అయినా సంబంధిత అధికార యంత్రాంగం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తుందని వాపోతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలంటే రోడ్డును హైదరాబాద్ వైపు పల్లంగా నిర్మించి వర్షం నీరు, మురుగు నీరు కింది వైపు ఉన్న పిల్లివాగులోకి తరలించడమే ఏకైక మార్గం. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మాడ్గుల: కేక్ కట్ చేస్తున్న వైద్య సిబ్బంది



ఆమనగల్లు: డాక్టర్లను సత్కరించిన లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు

వైద్యులు.. కనిపించే దేవుళ్లు

ఆపత్కాలంలో భగవంతుడే డాక్టర్ల రూపంలో సహాయ పడతాడని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో వైద్యులు, సిబ్బంది కేకులు కోసి సంబురాలు పెద్దఎత్తున చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యవృత్తి ప్రాధాన్యాన్ని కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



తలకొండపల్లిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల బస్తీ దవాఖానాలో వైద్యురాలికి సన్మానం



యాచారం: నస్దిక్‌సింగారం ఆయుర్వేద వైద్యురాలిని సన్మానిస్తున్న గ్రామస్తులు



కడ్తాల్: డాక్టర్ జాంప్లా నాయక్‌ను సన్మానించిన లయన్స్‌క్లబ్ సభ్యులు